

ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి సమీపంలో తెగిన బీటీ రోడ్డు



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వరదనీటిలో చిక్కుకున్న విద్యార్థినులను జేసీబీ సాయంతో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సిబ్బంది



నాగర్‌కర్నూల్‌లోని నాగనూల్ వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడుతున్న పోలీసులు

# మొగులుకు చిల్లు

## పోటెత్తిన వరద.. ఉప్పొంగిన వాగులు, చెరువులు

- చెరువులకు గండ్లు.. నీట మునిగిన పంటలు
- వరదధాటికి కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌లు.. ఎక్కడి రైళ్లక్కడే
- తాడ్వాయిలో 200 ఎకరాల అడవి ధ్వంసం
- శ్రీశైలం హైవేపై రాకపోకలు బంద్
- నడిగూడెంలో సాగర్ ఎడమ కాల్వకు, పిల్లలమర్రిలో మూసీ కాల్వకు గండి
- మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో అత్యధికంగా 45.65 సెం.మీ వర్షపాతం
- 2006 తర్వాత సెప్టెంబర్‌లో అత్యధిక వర్షపాతం



హుజూర్‌నగర్ పట్టణంలో మఠంపల్లి రోడ్డులో నీట వరద నీటిలో చిక్కుకున్న లారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): మొగులుకు చిల్లు పడింది. సెప్టెంబర్‌లో ఎన్నడూ లేనంతగా రికార్డు వాన దంచి కొట్టింది. ఎడతెరపిలేని భారీ వర్షాలతో తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. అత్యంత భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వాయుగుండం ప్రభావంతో పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఒక్కరోజే 30 సెం.మీపైగా వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 45.65 సెం.మీ, చిన్నగూడూరులో 45.16 సెం.మీ, నర్సింహులపేటలో 40.58, నెల్లికుదురులో 38.35 సెం.మీ, దంతాలపల్లిలో 35.09 సెం.మీ, మరిపెడలో 34.42 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 34.13 సెం.మీ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో 33.02 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 16.28 సెం.మీగా వాతావరణ శాఖ గుర్తించింది. 2006 సెప్టెంబర్ 19న కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో 44.06 సెం.మీ వర్షపాతం నమోదైంది. 18 సంవత్సరాల తర్వాత 2024 సెప్టెంబర్ 1న మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 45.65 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. భారీవర్షాలతో వరద ఉప్పొంగుతున్నది. ప్రాజెక్టులు, చెరువులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. చెరువులు అలుగు పారి గండ్లు పడుతున్నాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. పల్లెలు, లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇండ్లలోకి చేరిన నీళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గాలివాన బీభత్సానికి సుమారు 200 ఎకరాల్లో అడవి ధ్వంసమైంది. భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలోని తెలంగాణ నయాగార బొగత ఉధృతంగా జాలువారుతున్నది. దీంతో అటవీశాఖ అధికారులు సందర్శనను నిలిపివేశారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల ఆలయం ఎదుట మంజీరానది వనదుర్గా ప్రాజెక్టు మత్తడి దుంకడంతో అధికారులు ఆలయాన్ని మూసివేశారు. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవస్థానంపైకి ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించారు.

### సాగర్, మూసీ కాల్వలకు గండ్లు

వరద పోటెత్తడంతో కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం సమీపంలో నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు గండి పడింది. దాంతో రామచంద్రాపురం గ్రామంలోకి నీళ్లు చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. పంటలు నీటమునిగాయి. ఇక సూర్యాపేట మండలం పిల్లలమర్రి సమీపంలో మూసీ ఎడమ కాల్వకు గండి పడింది. దీంతో పంట పొలాలు నీట మునిగాయి. మూసీ అధికారులు వెంటనే ఇసుక బస్తాలు వేసి గండిని పూడ్చారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో ఎన్‌ఎస్‌పీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చే ప్రక్రియను ప్రారంభించారు.

### రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు బంద్

తెలంగాణ– ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచాయి. సాధారణంగా వాయుగుండం తీరం దాటిన ప్రాంతాల్లో ఉత్తర, దక్షిణ తీరాలలో తీవ్రత ఎక్కువగా ఉండి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి వెల్లడించారు. వాయుగుండం తీరం దాటిన తర్వాత బలహీన పడుతుందని, అనంతరం వర్షాలు తగ్గుముఖం పడతాయని ఆమె తెలిపారు.

**గడిచిన 24 గంటల్లో వివిధ జిల్లాల్లో నమోదైన అత్యధిక వర్షపాతం వివరాలు సెంటీమీటర్లలో**

| ప్రాంతం | వర్షపాతం | జిల్లా |
|---|---|---|
| ఇనుగుర్తి | 45.65 | మహబూబాబాద్ |
| చిన్నగూడూరు | 45.16 | మహబూబాబాద్ |
| నర్సింహులపేట | 40.58 | మహబూబాబాద్ |
| నెల్లికుదురు | 38.35 | మహబూబాబాద్ |
| దంతాలపల్లి | 35.09 | మహబూబాబాద్ |
| మరిపెడ | 34.42 | మహబూబాబాద్ |
| మద్దిరాల | 34.13 | సూర్యాపేట |
| కేసముద్రం | 33.76 | మహబూబాబాద్ |
| కురవి | 33.70 | మహబూబాబాద్ |
| తిరుమలాయపాలెం | 33.02 | ఖమ్మం |

# వరదల సమయంలో ప్రభుత్వం విఫలం

- ఖమ్మంలో పరిస్థితి దారుణంగా ఉన్నది
- అక్కడ ముగ్గురు మంత్రులున్నా దండుగ
- ప్రజలు వీధుల్లోకొచ్చి ఆందోళన చేస్తున్నరు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- సహాయక చర్యల్లో పాల్గొన్నవారికి ధన్యవాదాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : వరదల సమయంలో అప్రమత్తంగా ఉండి పరిస్థితిని అదుపుచేయాల్సిన ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఖమ్మంలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నదని, ఆ జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని ఆదివారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విసిగిపోయిన ప్రజలు ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో వీధుల్లోకొచ్చి నిరసనకు దిగారని చెప్పారు. వరదలతో ఇబ్బందులు పడుతూ కనీస సాయం కోసం ప్రజలు ఇలా ఆందోళన చేయడమంటే ప్రభుత్వం ఎంత ఉదాసీన వైఖరితో ఉన్నదో అర్థం చేసుకోవచ్చునన్నారు.

### స్పందించినవారికి అభినందనలు

భారీ వరదలు, వర్షాల సందర్భంలో సహాయ చర్యలు, పునరుద్ధరణ పనులపై చురుగ్గా స్పందించిన బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులు, విద్యుత్తు సిబ్బందిని కేటీఆర్ అభినందించారు. మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, నార్నే శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూల్ వాగులో ఓ వ్యక్తి కొట్టుకుపోతుండగా కాపాడిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను అభినందించారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సామాన్యుడిని కాపాడారని వారి ధైర్యసాహసాలకు ఎక్స్ వేదికగా కొనియాడారు. తీవ్ర ప్రతికూల వాతావరణం ఉన్నా విద్యుత్తు పునరుద్ధరణ కోసం సిబ్బంది అద్భుత పనితీరు కనబరుస్తున్నారని కేటీఆర్ అభినందించారు. ఎన్పీడీసీఎల్ ఉద్యోగి కరెంటు పోల్ ఎక్కి విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేస్తున్న వీడియో చూసి అతడిని అభినందించారు.వరదల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న అవసరార్థులకు సాయం చేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 24 గంటలు బీ అలర్ట్

- అధికారులు సెలవులు పెట్టొద్దు
- మంత్రులతో సీఎం సమీక్ష
- అధికారులతో టెలి కాన్ఫరెన్స్
- సచివాలయం కంట్రోల్ రూమ్ నంబర్ 040-23454088
- నేడు విద్యాసంస్థలకు సెలవు.. పరీక్షలు వాయిదా
- రాష్ట్రంలోని వరదపరిస్థితులపై కేంద్రం ఆరా .. సీఎంకు ప్రధాని, హోంమంత్రి ఫోన్
- రాష్ట్రానికి అదనంగా 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో సాగర్ ఎడుమ కాల్వకు పడిన గండి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎవరూ సెలవులు పెట్టొద్దని, సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని విధుల్లో నిమగ్నం కావాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాలపై సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులతో ఫోన్లో సీఎం రివ్యూ చేశారు. అనంతరం సీఎస్, డీజీపీ, మున్సిపల్, విద్యుత్తు, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్‌శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంవోకు పంపాలని ఆదేశించారు. భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని ఆదేశించారు. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా లిఫ్ట్‌చేసి రిజర్వాయర్లు నింపాలని ఆదేశించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటలు అలర్ట్‌గా ఉంటూ సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తలను రేవంత్‌రెడ్డి కోరారు.

### వరద నష్టంపై ప్రధాని ఆరా

సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి ఫోన్ చేసి వరద నష్టంపై ఆరా తీశారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయం అందిస్తామమని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.అంతకు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి వరద పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### గోదావరి తీరం వెంబడి అప్రమత్తం

ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి నది తీరం వెంబడి అధికారులు 24/7 అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్లు, రాష్ట్ర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సచివాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ రెడ్డి, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, మున్సిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో తదితరశాఖల అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి పరిస్థితిని స్వయంగా తాను పర్యవేక్షిస్తున్నానని చెప్పారు. జంట నగరాల్లో వరదల వల్ల ఏర్పడే విపత్తును ఎదుర్కోవడానికి హైడ్రాను సన్నద్ధం చేశామని వెల్లడించారు.

**సచివాలయం కంట్రోల్ రూమ్ నంబర్**
**040- 23454088**

### అంతరాయంలేని విద్యుత్తు అందించండి

భారీ వర్షాల నేపథ్యంలో వినియోగదారులకు అంతరాయం తలెత్తకుండా విద్యుత్తునందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి టీజీఎన్పీడీసీఎల్ సంస్థ ఎస్‌ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నీట మునిగిన సబ్‌స్టేషన్ల వివరాలు తెలుసుకుని, విద్యుత్తు పునరుద్ధరణకు కలెక్టర్లు, పోలీసు, రెవెన్యూశాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 45 పునరావాస కేంద్రాలు : పొంగులేటి

రాష్ట్రంలో 45 పునరావాస కేంద్రాలను తెరచి, 2,500 మందికిపైగా తరలించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 85 చెరువులు, కుంటలు, కాలువలకు గండ్లు పడ్డాయని ప్రాథమిక సమాచారం అందిందని చెప్పారు. వరద తీవ్రత అధికంగా ప్రాంతాలకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. తన నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి మండలం నాయకన్‌గూడెంకు చెందిన ఇటుకలపని చేసుకొనే యాకూబ్, ఆయన భార్య సైదాబీ వరదల్లో కొట్టుకోపోవడంపై మంత్రి శ్రీనివాసరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. అన్ని ఉన్నా కూడా వాతావరణం అనుకూలించక వారిని రక్షించుకోలేకపోయానని ఆవేదన వ్యక్తంచేశారు.

### అదనంగా 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

భారీ వర్షాల నేపథ్యంలో అదనంగా తొమ్మిది ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. చెన్నై, వైజాగ్, అసోం నుంచి మూడు చొప్పున మొత్తం 9 ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను తెలంగాణకు పంపాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్రంలో కురుస్తున్న కుంభవృష్టి వానలు, వరదల తీవ్రతను అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లడంతో తెలంగాణకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్టు చెప్పారు.

### నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా సెలవులివ్వాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఓయూతో పాటు మహత్మాగాంధీ వర్సిటీ, తెలంగాణ వర్సిటీ, జేఎన్టీయూ సోమవారం జరగాల్సిన పరీక్షలను అధికారులు వాయిదావేశారు. మంగళవారం వర్షాలు తగ్గకపోతే, వాతావరణ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.



దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీనేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# పార్టీలను పక్కనబెట్టి ఆదుకుందాం

- అనుకోని విపత్తుతో రాష్ట్రం అల్లకల్లోలం
- అనేకమంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం
- ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించాలి
- ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మర చర్యలు చేపట్టాలి
- మృతుల కుటుంబాలకు 25 లక్షలు, గాయపడ్డవారికి 5 లక్షలు అందించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి
- ప్రజలకు తోడుండాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/ సిద్దిపేట/చందంపేట (దేవరకొండ) : అనుకోని విపత్తు రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసిందని, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వర్షాల సందర్భంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించాలని చెప్పారు. వర్షాలు, వరదల కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారీ వర్షాలు, ప్రజల కష్టనష్టాలపై స్పందిస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేయడంతో పాటు నల్లగొండ జిల్లా దేవరకొండలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌తో కలిసి హరీశ్ విలేకరులతో మాట్లాడారు. కొందరు తమ కుటుంబ సభ్యులను కోల్పోయి ఆవేదన చెందుతుంటే, మరికొందరు నిరాశ్రయులై రోడ్డుమీద పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకొందరు పాడి పంటలు కోల్పోతే, మరికొందరు ఉపాధి కోల్పోయి కన్నీరు పెడుతున్నారని చెప్పారు. ఇలాంటి ఆపత్కాలంలో ఒకరికొకరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆపదలోఉన్న ప్రజలకు విశ్వాసం కలిగించేలా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులను అలర్ట్‌గా ఉంచాలని, అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, ఏజెన్సీ, ముంపు ప్రాంతాల్లో గర్భిణులను దవాఖానలకు తరలించాలని, పాముకాటు, కరెంట్ షాక్‌లకు గురైన వారికి తక్షణ వైద్యసేవలు అందేలా చూడాలని, ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడేందుకు కేంద్రం సాయం కోరాలని, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ను రంగంలోకి దింపాలని, హెలీకాప్టర్లను సైతం సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు అందించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రభావిత ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. తాత్కాలిక ఉపశమనం కోసం లక్ష ఆర్థిక సాయం చేయడంతో పాటు విపత్తులో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడ్డ వారికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఇవ్వాలని ప్రభుత్వానికి హరీశ్ విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యల కోసం ఖమ్మంలో ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అన్ని జిల్లాల నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని, కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. విలేకరులతో సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.